పేరుకే గ్రంథాలయం



దినపత్రికలకే పరిమితమైన బేల గ్రంథాలయం

- బేలలో దినపత్రికలకే పరిమితం
- పోటీ పరీక్షలకు బుక్స్ లేవు
- తాగునీరు, టాయిలెట్స్ కరువు

బేల: మండల కేంద్రంలోని పాఠకులకు విజ్ఞాన బండాగారమైన గ్రంథాలయం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రంథాలయం కేవలం దినపత్రిలకే పరిమితమైంది. పోటీ పరీక్షలకు బుక్స్ లేవు. తాగునీరు, టాయిలెట్స్ కరువయ్యాయి. దీంతో గ్రంథాలయం సమస్యల నిలయంగా మారింది. అక్కడికి వచ్చే పాఠకుల సంఖ్య కూడా పూర్తిగా తగ్గింది. గ్రంథాలయానికి పక్కా భవనం లేకపోవడంతో కొన్నాళ్లు అద్దె భవనంలో, మరి కొన్నాళ్లు ఎంపీడీవో కార్యాలయంలోని గదిలో, ఇంకొన్నేళ్లు అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగింది. ఈ క్రమంలో మండలానికి చెందిన అప్పటి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ ప్రత్యేక చొరవతో మూడేళ్ల క్రితం ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.15లక్షలు పక్కా భవన నిర్మాణానికి మంజూరు చేశారు. నిర్మాణ పనులు పూర్తయి అన్ని హంగులు ఏర్పాటు చేసి, భవనాన్ని 2022 డిసెంబరు 1న ప్రారంభించారు.



ఖాళీ దర్శనమిస్తున్న కుర్చీలు

ఈక్రమంలో గ్రంథాలయం అప్పటి నుంచి ఇప్పటి దాకా కేవలం మూడు టేబుల్స్, 15 కుర్చీలతో కొనసాగుతోంది. ఒకవైపు బుక్స్, మరో వైపు అసౌకర్యాలతో పాఠకులు, నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

దినపత్రికలే దిక్కు..

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పాఠకులకు కేవలం దినపత్రిలకే ఉన్నాయి. పోటీ పరీక్షల బుక్స్ లేవు. విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో పలువురు విద్యార్థులు, నిరుద్యోగులు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి వెళ్తున్నారు. 2022 డిసెంబర్ నుంచి నూతన భవనంలో కొనసాగుతున్నా.. తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యాలను అధికారులు కల్పించలేక పోయారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదని పాఠకులకు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

బుక్స్ ఉండేలా చూడాలి



మండల కేంద్రంలో గ్రంథాలయం పేరుకే ఉంది. కేవలం దినపత్రికలు మాత్రమే ఉంటున్నాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు బుక్స్ లేవు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమయ్యే బుక్స్ ఉండేలా చూడాలి.

–నవనీత్, పీజీ విద్యార్థి, దహెగాం

సౌకర్యాలు కల్పించాలి



మండల కేంద్రంలోని గ్రంథాలయం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రంథాలయంలో ఎటువంటి బుక్స్ లేవు. తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యాలు కరువయ్యాయి. ఇకనైనా మండల ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

–నార్లవార్ అజయ్, డిగ్రీ విద్యార్థి, మాంగ్రుడ్

తాగునీటిపై నివేదిక ఇవ్వండి



సమస్యలు తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ ఉపేందర్

- సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌ను ఆదేశించిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో తాగునీటి సౌకర్యం లేక రోగులు ఇబ్బంది పడుతున్న వైనాన్ని సాక్షి దినపత్రికలో శుక్రవారం 'సీహెచ్‌సీలో తాగునీటి కటకట' అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. సీహెచ్‌సీ సమస్యలపై ఆరా తీశారు. సీహెచ్‌సీలో తాగునీటి సమస్యలపై పూర్తి నివేదికను అందజేయాలని సూపరింటెండెంట్ ఉపేందర్‌ను ఆదేశించారు. ఆదివారం సీహెచ్‌సీను సందర్శించి, ఆస్పత్రికి నీటిని వాడుతున్న సంపును పరిశీలించారు. తాగునీటి సౌకర్యం కల్పించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు తాగు నీటి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

'ఎమ్మెల్యే హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న బండి విజయ్

ఉట్నూర్‌రూరల్: ఏసీ గదుల్లో పని చేసే ఉద్యోగులకు ప్రభుత్వం 1వ తారీఖున వేతనాలు ఇస్తూ, రైతులను పట్టించుకోవడం లేదని వ్యాఖ్యలు చేసిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని పీఆర్టీయు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరీశ్ రావు వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి జాదవ్ సంజయ్‌కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జాదవ్ గోవిందలు మాట్లాడుతూ.. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వక 20 తేదీ దాటిన తరువాత వేతనాలు ఇచ్చిందని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం పీఆర్సీ పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయుల ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, ఇతర బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి పెందూర్ బండు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన సవర్గాం గ్రామస్తులు

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సవర్గాం గ్రామస్తులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన నివాసంలో శాలువాతో సత్కరించారు. గ్రామాభివృద్ధితో పాటు జగదాంబ సేవాలాల్ ఆలయం, హనుమాన్ ఆలయాల వద్ద షెడ్ నిర్మాణం, సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సీసీరోడ్డుకు రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్, నారాయణ స్వామి, ఇందల్ నాయక్, ధరమ్ సింగ్, కిషన్, రాజేశుడు, మోతిలాల్, శివలాల్, తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మొగిలిని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ హిందూ ధార్మిక క్షేత్రాల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రల దృష్ట్యా ఉట్నూర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పోలీసుశాఖ నుంచి మంచి సేవలు అందిస్తామన్నారు. ప్రజలు సైతం పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అరికిల్ల అశోక్, ఠాకూర్ గోపాల్ సింగ్, కొడిచర్ల రాజశేఖర్, వెంకటేశ్, సాడిగే రాజగోపాల్ పాల్గొన్నారు.

వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఈనెల 13, 14న నిర్వహించే పరమ హంస సద్గురు పూలాజీ బాబా ధాన్య మందిర 18వ వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేతుల మీదుగా విడుదల చేశారు. పూలాజీ బాబా ధ్యాన మందిర వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు మహనీయుడు చూపిన మార్గంలో నడవాలన్నారు. ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, ఆంద్ ఆదివాసీ సంఘం నాయకులు రాందాస్, కరడే మారుతి, ముఖడే విష్ణు, ఆత్మ రామ్, తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చండి



రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

నేరడిగొండ: మండల కేంద్రం నుంచి కుంటాల జలపాతం వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. ఆ దారిగుండా వెళ్లే వాహనదారులకు ప్రమాదం పొంచిఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంత ను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బోథ్: దేవుల్ నాయక్‌తండా గ్రామంలో రూ.3 లక్షల ఉపాధిహామీ నిధులతో చేపట్టే రోడ్డు పనులను ఎంపీటీసీ సునీత రోహిదాస్ ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌తో పా టు, ఎంపీపీ తుల శ్రీనివాస్‌లకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జాదవ్ బాబులాల్, మోతీలాల్, ఆడె ధరమ్ సింగ్, జాదవ్ కృష్ణ, రాథోడ్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అశ్విన్ రెడ్డిని కలిసిన ఆత్రం భాస్కర్

నేరడిగొండ: కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త ఏలేటి అశ్విన్ రెడ్డిని పార్లమెంట్ ఆశావహ అభ్యర్థి ఆత్రం భాస్కర్, ప్రముఖ పాత్రికేయులు కరీంలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం మండల కేంద్రంలోని కలిసి మద్దతు ప్రకటించాలని కోరారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన ప్రణాళికలు, నిర్ణయాలను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఆత్రం మహేందర్, సునీల్, నాగ రెడ్డి, గూడాల అనీష్ కుమార్ ఉన్నారు.

యువకులకు సన్మానం

తలమడుగు: టీజీటీ ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తాంసి గ్రామానికి చెందిన శ్రీకాంత్, నిపాని గ్రామానికి చెందిన గంపల మహేశ్‌లను మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్, రాజేశ్వర్, గజానంద్, మగ్గిడి ప్రకాష్, రమేశ్, మేకల దత్తు, రమాకాంత్, నేతుల గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మహిళలు



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న నాయకులు



బోథ్: సొనాలలో..

ఇంద్రవెల్లి: చదువుల తల్లి సావిత్రీబాయి పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ కాలోనిలోని త్రివర్ణ బుద్ధ విహార్, బుద్ధనగర్‌లోని బుద్ధ విహార్‌లో మహామాయ ఉపాసిక సంఘ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాలతో పాటు అగ్రవర్ణ పేదలకు విద్యను అందించిన మహనీయురాలని కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు వాగ్మారే ఉషాబాయి, మాయవతి, మధుమాల, ప్ర భాబాయి, లతబాయి, మీరాబాయి పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మాల సంక్షేమ భవనంలో ఆదివారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షుడు బొజ్జ లక్ష్మణ్, సెక్రెటరీ మైల మహేశ్‌కుమార్, శాంతపురపు రాజేశ్వర్, బొజ్జ రాజేందర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆదివారం పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చదువుల తల్లి సావిత్రిబాయి ఎందరికో ఆదర్శమని సొసైటీ చైర్మన్ గాజుల పోతన్న, ప్రధాన కార్యదర్శి రమేశ్ అన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీధర్, విజయ్ భాస్కర్ రెడ్డి, కసిరె పోతన్న, అమృత్ రావ్ పాటిల్, సంఘపాల్, జక్కుల రవి, అనిల్, సదానందం, అబూద్, బలరాం పాల్గొన్నారు.

నార్నూర్: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు యనుస్ అక్బాని, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్‌ఆడే, ఎంపీటీసీ పరమేశ్వర్, డైరెక్టర్ దుర్గే కాంతారావు, దేవరావు లోకండే, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలాజీ కాంబ్లే, రాథోడ్ దత్తారం, దుర్గే రుక్మబాయి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని పాటగూడ, కొలాంగూడ గ్రామాల్లో పర్యటించి కొలాం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. దోడంద గట్టెపల్లిలో నీటి సమస్య నెలకొందని, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, పవార్ దుదిరామ్, సోమోరే నాగోరావ్, చహకటి మానిక్‌రావ్, ప్రకాష్, మారుతి, కుమ్ర తుకారం, ఆత్రం గోవింద్, కుమ్ర లక్కేరావ్ పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

ఉట్నూర్‌రూరల్: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర కాలనీలో పొద్దు పొడుపు.. బొజ్జన్న అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది, కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీరు, రోడ్డు, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లాజర్, సలీం, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని పెందూర్ గూడ గ్రామవాసి నర్సాపూర్ రాయిసెంటర్ సార్మేడి దేవుషా భార్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఉట్నూర్‌రూరల్: పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీకాంప్లెక్స్‌లో హైమన్‌డార్ఫ్ స్టడీ సర్కిల్‌ను శనివారం రాత్రి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి స్టడీ సర్కిల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్, కుర్చీలు, టేబుల్, ఇంటర్నెట్ సదుపాయాలను కల్పిస్తామన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్



ఈర్ల శ్రీకాంత్

నేరడిగొండ: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఈర్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఆడె రాజు, రాయల్ శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా గోవింద్, కార్తీక్, ప్రవీణ్, షేక్ ఆసిఫ్, మహేశ్, సంతోష్, హమీద్‌లను నియమించారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో పాటు మండల కన్వీనర్ ఆడే వసంత్‌రావు, జిల్లా యూత్ అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన సప్తాహం

ఇచ్చోడ: మండలంలోని గాంధీనగర్‌లో ఆదివారం సప్తాహ కార్యక్రమం ముగిసింది. వారం రోజుల నుంచి కొనసాగుతున్న కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. సప్తాహ ముగింపు రోజు అర్జున్ సాటే మహరాజ్ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్‌లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీ అందజేశారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణస్థాయి క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలన్నారు. కబడ్డీలో మొదటి బహుమతి చిన్న మాలి బోరిగం, రెండో బహుమతి టెక్డి గూడ జట్టు గెలిపొందాయి. వాలీబాల్‌లో మొదటి బహుమతి మత్తడి గూడ గ్రామం, రెండో బహుమతి తలమడుగు మండలం పల్లి(కె) జట్లు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధర్మపురి చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రెడ్డి, నాయకులు ప్రభాకర్, నాగరాజు, ఆనంద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో పది రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కనుగుట్ట, దేగాం జట్లు తలపడ్డాయి. కనుగుట్ట జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతి 20,000, రెండో బహుమతి 10.000లను అందించారు. ఎంపీటీసీ జమున రాజేశ్వర్, గడ్డల నారాయణ,ఇధపు పోషెట్టి,భీమ బూచన్న, రవి అశోక్,కుమ్మరి వంశీ ,భీమ ప్రవీణ్,శ్రీకాంత్ యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు

గొప్ప క్రీడాకారులుగా ఎదగాలి

ఆదిలాబాద్: అవకాశాలను అందిపుచ్చుకొని జిల్లా క్రికెటర్లు గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో జేసీ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభ గల క్రికెటర్లు ఉన్నారని అన్నారు. నైపుణ్యం గల క్రీడాకారులను ప్రోత్సహించేలా టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్రికెట్ అకాడమీ నిర్వాహకులు జయేంద్ర పటాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన వైద్యుడు



వైద్యుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని పాత ఉట్నూర్ చెందిన మెస్రం గీత బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. భార్య భర్తలు కూలీనాలి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గ్రామస్తులు తలకొంత నగదు జమ చేసి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. హైదరాబాద్ నిమ్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న నార్నూర్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ జాదవ్ నితిన్‌కుమార్ వారి పరిస్థితిని గమనించాడు. తన సొంత ఖర్చులతో మెరుగైన వైద్యం అందించాడు. సహాయం చేసిన వైద్యుడిని పాత ఉట్నూర్ గ్రామస్తులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇందులో ఉట్నూర్ గ్రామపటేల్ ఆత్రం లక్ష్మణ్, దేవరీ మడావి లక్ష్మణ్, కుర్సెంగ మోతీరాం, తుంరం మల్కు పాల్గొన్నారు.

విజయ సంకల్ప సమ్మేళనం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బ్రహ్మానంద్

ఆదిలాబాద్: హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 12న నిర్వహించే బీజేపీ బూత్‌స్థాయి అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. విజయ సంకల్ప సమ్మేళన కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్ చంద్ర, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించే వరకు ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ నరేశ్‌రెడ్డి

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాల గుండా కరంజి(టి) వరకు ఉన్న అంతరాష్ట్ర రోడ్డు పనులు ప్రారంభించే వరకు రోడ్డు సాధన సమితి తరపున ఉద్యమిస్తామని కన్వీనర్ ఎల్టి నరేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కరంజి(టి)లో గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. గత కొన్నేళ్లుగా రోడ్డు నిర్మాణం జరగక అవస్థలు పడుతున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ రూట్లలో ప్రయాణిస్తే తమ బాధలు తెలుస్తాయన్నారు. రెండో రోజుల్లో పనులు ప్రారంభించకపోతే రిలే దీక్షలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ప్రవీణ్, గజానన్, సతీష్, భీంరెడ్డి పాల్గొన్నారు.